ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
శనివారం 17 ఆగస్టు 2024



వరములనివ్వు వరలక్ష్మి



సిద్దిపేటలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు



సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో..



విశేష అలంకరణలో సంతోషిమాత

జిల్లాలోని ఆలయాలు వరలక్ష్మి వ్రతం సందర్భంగా భక్తులతో నిండిపోయాయి. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. వరములనివ్వు వరలక్ష్మి అని వేడుకున్నారు. సిద్దిపేట పట్టణంలోని శ్రీ సంతోషిమాత దేవాలయం 27వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పాడిచేటి రామకృష్ణ పర్యవేక్షణలో వ్రతక్రతువు నిర్వహించారు.

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 15



వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళ

మల్లన్నసాగర్ టు హైదరాబాద్

మహానగర తాగునీటికి జిల్లా నుంచి జలాలు

- 20 టీఎంసీలు వినియోగించుకునేలా ప్లాన్
- ఇప్పటికే ప్రత్యేకంగా హెచ్‌ఎండబ్ల్యూఎస్ వాటర్ ట్యాపింగ్ పాయింట్
- సాధ్యాసాధ్యాలపై చర్చించిన ప్రభుత్వం
- డీపీఆర్ తయారు చేయాలని ఆదేశాలు జారీ



సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మంగోల్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్‌ఎండబ్ల్యూఎస్ వాటర్ ట్యాపింగ్ పాయింట్

గజ్వేల్, ఆగస్టు 16: హైదరాబాద్ మహానగరానికి తాగునీటి గోస లేకుండా, భవిష్యత్ రాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు కదులుతుంది. ఇందుకు పూర్తిస్థాయిలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ ఉపయోగించుకునేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఇప్పటికే హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఎల్లంపల్లి నుంచి సుజల స్రవంతి పైప్ లైన్ ద్వారా తాగునీటిని తరలిస్తున్న ప్రభుత్వం.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లో నిర్మించిన మల్లన్నసాగర్ నుంచి 20టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు సిద్ధమైంది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలోని కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించాలని భావించినప్పటికీ కొండపోచమ్మ జలాశయం సామర్థ్యం కేవలం 15 టీఎంసీలు మాత్రమే కావడంతో మల్లన్నసాగర్ జలాశయం నుంచి నీటిని వినియోగించుకునేందుకు ప్లాన్ చేశారు.



వెంటనే డీపీఆర్‌ను తయారు చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందుకు సంబంధించి రూ.5600 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వం ప్రాథమికంగా భావించగా, ఈ నిధుల సేకరణపై సైతం ప్రభుత్వం దృష్టిసారించింది.

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు ప్రత్యేక ట్యాపింగ్ పాయింట్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్న సాగర్ రిజర్వాయర్‌కు మిషన్ భగీరథతో పాటు హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు ప్రత్యేకంగా ట్యాపింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ ట్యాపింగ్ పాయింట్ ద్వారా హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని తరలించనున్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథకు 1.6 టీఎంసీల నీటిని వినియోగించుకుంటుండగా హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గజ్వేల్ మండలం అక్కారం వద్ద నిర్మించిన పంప్‌హౌస్ నుంచి శామీర్‌పేట మండలం ఘన్‌పూర్ వద్ద నిర్మించిన జీఎల్బీఆర్‌కు తరలించనున్నారు. అక్కడే 780 ఎంఎల్‌డి సామర్థ్యం గల భారీ నీటి శుద్ధి జలాశయాన్ని నిర్మించనున్నారు. అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ముత్తంగి జంక్షన్‌కు తరలించనున్నారు. అక్కడి నుంచి ఇప్పటికే గల రింగ్ మెయిన్‌కు కనెక్ట్ చేసి 86ఎంజీడీ నీటిని పశ్చిమ నగరానికి అందజేయనున్నారు. అక్కడి నుంచి గతంలో హైదరాబాద్‌కు తాగునీటిని అందించిన రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు నీటిని తరలించనున్నారు. ఉస్మాన్‌సాగర్ వద్ద 120ఎంఎల్‌డీ సామర్థ్యం గల డబ్ల్యూటీపీ, ఉస్మాన్‌సాగర్ వద్ద 70 ఎంఎల్‌డీ సామర్థ్యం గల డబ్ల్యూటీపీని నిర్మించనున్నారు. మహానగర తాగునీటి గోసను తీర్చేందుకు ప్రస్తుతం అధికారులు కసరత్తు చేస్తున్నారు. పూర్తిస్థాయి డిపిఆర్‌ను తయారు చేయాలని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అండర్ టేకింగ్‌లో గల వ్యాప్‌కోస్ సంస్థకు బాధ్యతలను అప్పగించింది. డీపీఆర్ వచ్చిన వెంటనే పనులను ప్రారంభించనున్నారు.

గండిపల్లికి గండాలు..!

- ప్రాజెక్టు ప్రారంభించి 17 ఏళ్లు
- అంచనాలు పెంచి వదిలేసిన గత సర్కార్
- ఆరు నెలల్లో పూర్తి చేస్తామని రేవంత్ హామీ

అక్కన్నపేట, ఆగస్టు 16: ప్రాజెక్టు పనులు ప్రారంభించి 17 ఏళ్లు. కాగితాల మీద ఆయకట్టు, అంచనాలు పెరుగుతున్నా.. పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు తర్వాత గత ప్రభుత్వం చేపట్టిన కొండపోచమ్మ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లు పూర్తి అయ్యాయి. కానీ, మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గండిపల్లి రిజర్వాయర్‌కు మాత్రం మోక్షం లభించడం లేదు. దీంతో కట్టపై తుమ్మలు, పిచ్చి చెట్లు పెరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2007 సెప్టెంబరు 9న గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మూడేళ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయినా, పనులు ప్రారంభం కాలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను రీడిజైన్ చేసింది. ఇందులో భాగంగా 2015లో అప్పటి సీఎం కేసీఆర్ గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను సందర్శించారు. ఒక టీఎంసీ సామర్థ్యం గల గౌరవెల్లి ప్రాజెక్టును 8.25 టీఎంసీలకు పెంచి నిధులు మంజూరు చేయడంతో 95 శాతం పనులు దాదాపు పూర్తయ్యాయి. గండిపల్లి ప్రాజెక్టును 0.5టీఎంసీల నుంచి ఒక టీఎంసీకి పెంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో అప్పటి వరకు చేపట్టిన పనులు 50 శాతం పూర్తి కాగా, వాటిని ఆపేశారు. రూ. 510 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. గండిపల్లి ప్రాజెక్టు ద్వారా 14 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మొదట ప్రతిపాదించగా, రీడిజైన్ తో 44 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే, ఆ తర్వాత అప్పటి ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ఇటీవల బడ్జెట్‌లో రూ. 437 కోట్లు కేటాయించింది. గండపల్లి ప్రాజెక్టును ఊసే లేకపోవడంతో ఈ ప్రాంత రైతాంగం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది.

ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ

పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి 2023 మార్చిలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గండిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. ఆయనతో పాటు ప్రస్తుత హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు ఉన్నారు. ప్రాజెక్టు భూనిర్వాసితులు, రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో ప్రాజెకును పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అయినా, ప్రాజెక్టు పనుల దిశగా ఎలాంటి అడుగు పడలేదు.



గండిపల్లి రిజర్వాయర్ ప్రాంతం

మంత్రిపైనే ఆశలు..

దివంగత సీఎం వైఎస్సార్ గండిపల్లికి శంకుస్థాపన చేసిన సమయంలో ఆయనకు సన్నిహితుడిగా ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. అలాగే, ప్రస్తుత సీఎం గండిపల్లి రైతులకు హామీ ఇచ్చిన సమయంలోనూ పక్కన పొన్నం ఉన్నారు. ఈ నేపథ్యంలో గండిపల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ పూనుకోవాలని ఈ ప్రాంత రైతాంగం కోరుతున్నారు.

అప్పు చెల్లించలేదని అన్నా వదినలను కట్టేసిన తమ్ముడు

- ఆలయ గ్రిల్స్‌కు తాడుతో కట్టేసిన వైనం
- సిద్దిపేట పట్టణ నడిబొడ్డున ఘటన



అన్నావదినలను గుడి ప్రాంగణంలో కట్టేసిన దృశ్యం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16: అప్పు చెల్లించలేదని అన్నావదినలను తమ్ముడు చెట్టుకు కట్టేసిన సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. పట్టణ నడిబొడ్డున జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పురా చెందిన దొంతరబోయిన కనకయ్య, దొంతరబోయిన పరుశరాములు అన్నదమ్ములు. కనకయ్య భార్య భాగ్య, ఇద్దరు కుమారులతో కలిసి నాసరపురాలో ఉంటున్నాడు. పరశురాములు భార్య తార, కుటుంబ సభ్యులతో కలిసి పట్టణ శివారులోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్నాడు. అన్న అయిన పరుశురాములు తన అవసర నిమిత్తం ఆరు నెలల క్రితం కనకయ్య వద్ద రూ. లక్షా 20 వేలు అప్పుగా తీసుకున్నాడు. నాలుగు నెలల క్రితం రూ. లక్ష తీర్చేశాడు. మిగిలిన డబ్బులు, వడ్డీ కోసం అన్నదమ్ముల మధ్య గొడవలు జరిగాయి. శుక్రవారం నాసర్‌పురా వార్డు కౌన్సిలర్ పరశురాములుకు ఫోన్ చేసి 'డబ్బుల విషయం మాట్లాడాలి రండీ' అంటూ పిలిచాడు. భార్య తారతో కలిసి కౌన్సిలర్ ఇంటికి వెళ్లారు. అక్కడికి అతని తమ్ముడు కనకయ్య ఆయన భార్య భాగ్య వచ్చారు. ఇరువురి మధ్య డబ్బుల విషయంలో గొడవ జరగడంతో కౌన్సిలర్ ఇరువర్గాలను బయటకు పంపించారు. అక్కడి నుంచి పరుశురాములు తన భార్యను తీసుకుని నాసర్‌పుర హనుమాన్ ఆలయం దాటుతుండగా, కనకయ్య వచ్చి 'డబ్బులు ఇవ్వకుండా ఎక్కడికి పోతావ్' అంటూ ఆలయం వద్దకు లాక్కుని వెళ్లాడు. అదే క్రమంలో తన కుమారుడు భానును తాడు తీసుకురావాలని పురమాయించాడు. అతను తాడు తీసుకురావడంతో పరుశురాములును ఆలయ గ్రిల్స్‌కు కడుతుండగా, వదిన తార అడ్డు వచ్చింది. దీంతో ఆమెనూ కట్టేశాడు. కనకయ్య, అతని భార్య భాగ్య కలిసి అన్నా వదినలపై దాడి చేశారు. స్థానికులు వచ్చి విడిపించి, వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఎం.మను చౌదరి

సీజనల్ వ్యాధుల బారిన పడొద్దు

- కలెక్టర్ మనుచౌదరి
- గురుకుల పాఠశాల సందర్శన

సిద్దిపేట రూరల్, ఆగస్టు 16: విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఎం. మనుచౌదరి సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన బాలికల గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలించి, సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం స్నాక్స్‌ను శుభ్రంగా వండి వేడిగా వడ్డించాలని సూచించారు. పాఠశాలకు వచ్చే దారి, ప్రహరీ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని, డార్మెంటరీ లేక తరగతి గదిలోనే ఉంటున్నారని, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 15 బాత్‌రూంలు, 15 మరుగుదొడ్లు నిర్మించాలని, పాఠశాల ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, త్వరలోనే వీటి నిర్మాణం చేపడుతామన్నారు. డార్మెంటరీలో వంట కోసం ఉపయోగిస్తున్న బియ్యం, కూరగాయలు ఇతర వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ హరికిరణ్ కుమార్, ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఈడబ్ల్యూఐడీసీ ఏఈ షఫీ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రం, గురుకులం తనిఖీ

వర్గల్, ఆగస్టు 16: అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్, రాష్ట్ర డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వాణి శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో జ్వరాలు, డెంగ్యూ, వైరల్ ఫీవర్, మలేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ ఆనంద్, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజ్, ఎంపీడీవో విజయలక్ష్మీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న జూనియర్ డాక్టర్లు, మెడికల్ కాలేజ్ విద్యార్థులు

వైద్యులకు రక్షణ కల్పించాలి

- నినదించిన జూడాలు
- హాజరైన మెడికోలు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16 : ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ కల్పించాలని జూనియర్ డాకర్లు, సిద్దిపేట మెడికల్ కళాశాల, సురభి మెడికల్ కళాశాల విద్యార్థులు నినదించారు. కోల్‌కతాలోని ఆర్జికార్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ భారీ ర్యాలీ తీసి, అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. ఫ్లాష్‌మాబ్ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ హేమంత్ మాట్లాడారు. రక్షాబంధన్ సందర్భంగా మహిళా జూనియర్ డాక్టర్లకు నైక్, పేపర్ స్ప్రే బహుమతిగా అందించారు. అత్యాచార ఘటనలపై మెడికోలు నృత్య ప్రదర్శన ఇచ్చారు.



నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థిని

నేడు ప్రైవేట్ వైద్య సేవలు బంద్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16 : కోల్‌కతా ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 17న సిద్దిపేటలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో, అన్ని రకాల వైద్య సేవలను నిలిపి వేస్తున్నట్లు సిద్దిపేట ఐఎంఏ అధ్యక్షుడు భాస్కర్‌రావు, కార్యదర్శి రవికాంత్‌లు తెలిపారు. శనివారం అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు మూసి ఉంటాయని, ప్రజలు సహకరించాలని అన్నారు.

జిల్లాలో భారీ వర్షం

- పంటలకు జీవం పోసిన వాన



జిల్లా కేంద్రంలో వర్షం

సిద్దిపేట కలెక్టరేట్/ బెజ్జంకి/చిన్నకోదూరు, ఆగస్టు 16: వానాకాలం మొదలైనప్పటి నుంచి ఆశించిన వానలు లేక దిగులు పడుతున్న రైతులు శుక్రవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల భారీ.. మరికొన్ని చోట్ల మోస్తారు వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల నుంచి ఉక్కపోతతో అల్లాడిపోయిన జనం వర్షంతో ఉపశమనం పొందారు. విత్తనమేసిననాటి నుంచి వానలు లేక వాడిపోతున్న పంటలకు ఈ వర్షం ఊపిరిపోసింది. జిల్లా వ్యాప్తంగా 9.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో వానాకాలం సాగుపై ఆశలు చిగురించాయి. జిల్లాలోని కోహెడ మండలం శనిగరం గ్రామంలో అత్యధికంగా 10.3 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో 8.4సెంటీమీటర్లు, చీకోడులో 8.4 సెంటీమీటర్లు, బెజ్జంకి మండలంలో 6.3 సెంటీమీటర్లు, సిద్దిపేట అర్బన్ మండలంలో 46.4 మిల్లీమీటర్లు, కోహెడ 45.6, మిరుదొడ్డి 37.3, బెజ్జంకి 33.3, గజ్వేల్ 32.5, నారాయణరావుపేట 29.8 రాయపోల్ 28.3, ములుగు 26.8, దుబ్బాక 16.3, మర్కుక్ 15.8, జగదేవ్‌పూర్ 11.3, అక్బర్ పేట-భూంపల్లి 8.0, సిద్దిపేట రూరల్ 4.5, చిన్నకోదూరు 3.0, వర్గల్‌లో 1.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పిడుగు పాటుకు గేదె, మేకలు మృతి

తొగుట, ఆగస్టు 16: తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో పిడుగుపాటుకు ఓ పాడిగేదెతో పాటు మూడు మేకలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన సుతారి మల్లేశం పశువులను మేతకు తీసుకెళ్లగా, ఒక్కసారిగా వర్షంతో పాటు పిడుగు పడటంతో అవి చెల్లాచెదురయ్యాయి. తర్వాత చూసుకోగా, ఓ గేదె మృతి చెంది కనిపించింది. రూ. 20 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కానుగల్ గ్రామంలో ముడికే కనకయ్యకు చెందిన మూడు మేకలు పిడుగుపాటుకు చనిపోయాయి.



బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లో నీట మునిగిన వరి పంట పొలాలు

అర్ధరాత్రి దొంగల సంచారం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16: సిద్దిపేటలో రెండురోజుల క్రితం అర్ధరాత్రి ఐదు గురు సభ్యులతో కూడిన దొంగల ముఠా పలు కాలనీల్లో సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. పట్టణంలోని ప్రశాంత్‌నగర్, సీతారాంనగర్ కాల నీల్లో 14న అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో దొంగలు సంచరిస్తున్నట్లు ఇళ్ల ముందు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో రికార్డైన వీడియో శుక్రవారం వెలుగు లోకి వచ్చింది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచాలని పలువురు కోరుతున్నారు.

సమయానికి బస్సులు నడపాలి

● ప్రధాన రహదారిపై విద్యార్థుల ధర్నా



బస్సులు సమయానికి నడపాలని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

చిలప్‌చెడ్, ఆగస్టు 16: బస్సులు సమయానికి రాకపోవడంతో తాము క్లాసులు మిస్సవుతున్నామని విద్యార్థులు ఆందోళన చేస్తూ శుక్రవారం చిలప్ చెడ్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇంటినుంచి వచ్చి ఎంతసేపు వేచిచూసినా.. బస్సులు సమయానికి రావడం లేదని ఆరోపించారు. దీంతో తాము క్లాసులు మిస్సవుతున్నామని, సాయంత్రం కూడా ఇంటికి రావడానికి ఆలస్యం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యకు పరిష్కారం లభించేవరకూ కదలబోమని రోడ్డుపై భీష్మించి కూర్చున్నారు. దీంతో గంట పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పాడెపు పాండరి, నాయకుడు నర్సింహారెడ్డి విద్యార్థులను సముదాయించి బుధవారం వరకు సమస్యను పరిష్కారం చేయిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆవుల రాజిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



భానుప్రసాద్ (ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 16: కుటుంబ కలహాలతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కొమ్మట భాను ప్రసాద్(26)కు భార్యతో రెండురోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భానుప్రసాద్ సమీపంలోని పంట పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.


వరలక్ష్మీదేవిగా అమ్మవారు


ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను సన్మానిస్తున్న వేదపండితులు


ఆలయ మండపంలో చిన్నారులకు అక్షర స్వీకారాలు

వరాల తల్లి.. విద్యా సరస్వతీ అమ్మవారు

- వర్గల్ విద్యాధరి క్షేత్రంలో వైభవంగా మూలమహోత్సవం
- వరలక్ష్మి అలంకరణలో అమ్మవారు
- వేడుకలకు తరలివచ్చిన వేలాధిమంది భక్తులు
- భక్తిపారవశ్యమైన క్షేత్రం

వర్గల్, ఆగస్టు 16: వర్గల్ కేంద్రంలోని శంభుగిరి కొండలపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా విద్యాసరస్వతీ అమ్మవారు శ్రీవరలక్ష్మి అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవరలక్ష్మి, మూలనక్షత్రం ఒకేరోజు రావడంతో విద్యాధరి క్షేత్రానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలతో పాటు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం శ్రీవరలక్ష్మి అలంకరణలో విద్యాసరస్వతీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రంలో వందల సంఖ్యలో చిన్నారులకు అక్షర స్వీకారాలు చేశారు. మూల సందర్భంగా ఆలయంలో చండీ హోమం, అమ్మవారికి లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి కృషిచేస్తున్న దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా ప్రసాదాలను అందజేశారు. వేడుకల సందర్భంగా క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శంభుగిరి కొండలు భక్తిపారవశ్యమైనాయి.

నాచగిరి క్షేత్రంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

వర్గల్, ఆగస్టు 16: జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ యాగశాలలో వేదపండితులు హోమాధి కార్యక్రమాలు జరిపారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. వేడుకల సందర్భంగా నాచగిరి పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.


వర్గల్ నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేసుకుంటున్న భక్తులు

రెండు బైకులు ఢీకొని, యువకుడి మృతి

● నలుగురికి తీవ్రగాయాలు


మహేష్(ఫైల్)

నారాయణఖేడ్, ఆగస్టు 16: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో యువకుడు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మండల కేంద్రమైన రేగోడుకు చెందిన వెన్నెల మహేష్(20) ఇటీవల ఇంటర్ ఉత్తర్ణత సాధించడంతో, బీఫార్మసీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి రావడంతో.. అదే గ్రామానికి చెందిన మిత్రులు నవీన్(20), సాయికిరణ్(19)లతో కలిసి సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు శుక్రవారం మధ్యాహ్నం (టీఎస్ 35 జీ9746) నెంబరు గల బైక్‌పై వచ్చారు. తిరిగి రేగోడుకు వెళ్తున్న క్రమంలో.. అదే మండలం టి.లింగంపల్లికి చెందిన సయ్యద్(25), రేహాన్(25).. టీఎస్ 35 జీ 2050 నెంబరు గల బైక్‌పై వస్తుండగా.. నారాయణఖేడ్ మండలం రుద్రార్ ప్రధాన రహదారిపై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఖేడ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇందులో వెన్నెల మహేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉండడంతో.. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు వెన్నెల మహేష్ తండ్రి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వెనక నుంచి డీసీఎంను ఢీకొట్టిన లారీ

● డ్రైవర్ మృతి, ముగ్గురికి గాయాలు


అమీన్‌ఖాన్(ఫైల్)

నర్సాపూర్, ఆగస్టు 16: డీసీఎంను వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టిన ఘటనలో డీసీఎం డ్రైవర్ మృతిచెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నర్సాపూర్ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ లింగం శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణంలో కొండా బ్రదర్స్ బట్టల దుకాణం వద్ద నుంచి వెళ్తున్న డీసీఎంను హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ వేగంగా వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో డీసీఎం ఒక్కసారిగా అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లి.. అక్కడున్న స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ అమీన్‌ఖాన్(48) క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రగాయాలకు గురయ్యాడు. డీసీఎంలో ఉన్న నర్సింహులు, వెంకటేశంగౌడ్, శ్రీధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

● అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఘటన

రామాయంపేట, ఆగస్టు 16: భార్యాభర్తలు కలిసి బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఘటన శుక్రవారం రాత్రి రామాయంపేట పాత హైవేపై చోటు చేసుకున్నది. నార్సింగి మండలం జప్తిశివనూర్‌కు చెందిన మధార్ తన భార్య బీబీతో కలిసి గజ్వేల్ ప్రాంతంలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని వస్తుండగా.. ఎదురుగా వచ్చిన బొలెరో ఢీకొట్టింది. ఈ ఘటనలో మధార్(55) అక్కడికక్కడే మృతిచెందగా.. భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.పోలీసులు అక్కడికి చేరుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గుండారెడ్డిపల్లిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం


వృద్ధుడి మృతదేహం

కోహెడ, ఆగస్టు 16: మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్కారెడ్డి కనకయ్య అనే రైతు వ్యవసాయ బావి సమీపంలో ఓ వృద్ధుడి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి ముందుగా పంచాయతీ కార్యదర్శి అంబటి రాజశేఖర్ వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై గాయాలు లేవని, ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలుపు గీతల చొక్కా, నల్ల ప్యాంటు, బూట్లు ధరించిన వృద్ధుడి జేబులో రూ.3 వేల నగదు ఉన్నట్లు గుర్తించారు. అలాగే చేతికి గడియారం ఉన్నదని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మృతుడి వయస్సు 60 నుంచి 65 ఏళ్ల వరకు ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

జిన్నారం, ఆగస్టు 16: కుటుంబ కలహాలతో భార్యను హత్యచేసిన కేసులో భర్తను బొల్లారం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ గంగాధర్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అనిల్‌కుమార్ ఫేస్‌బుక్‌లో పరిచయమైన హార్సతీకాతున్(25)ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ కొంతకాలం క్రితం ఉపాధికోసం బొల్లారంకు వచ్చి నివాసముంటున్నారు. ఈ నెల 7న అనిల్‌కుమార్ భార్యను కాతున్ పారిశ్రామికవాడలోని ఫోటున్ పరిశ్రమ సమీపంలో మెడకు చున్నీ బిగించి హత్యచేశాడు. కుళ్లిన స్థితిలో ఉన్న ఆమె మృతదేహాన్ని 13న పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. భర్త అనిల్‌కుమార్ హత్యకు పాల్పడ్డట్లు తేలింది. బీహార్‌కు పారిపోయిన అనిల్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కొమురవెల్లిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్


విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల, ఆగస్టు 16: కొమురవెల్లి మండల కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తూ, అవసరాల కోసం విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. శుక్రవారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. కామారెడ్డికి చెందిన కంకణాల భరత్‌కుమార్ కొద్దిరోజులుగా కొమురవెల్లి మండల కేంద్రంలోని వైన్‌షాప్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్న కామారెడ్డికి చెందిన చిటికె నాగరాజు తరచూ భరత్‌కుమార్ దగ్గరికి వచ్చిపోతున్న క్రమంలో ఫతేనగర్ నుంచి గంజాయి తీసుకొచ్చి భరత్‌కుమార్‌కు ఇస్తూ సేవించడంతో పాటు డబ్బుల కోసం ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా కొమురవెల్లికి చెందిన లింగంపల్లి దుర్గయ్యకు అందించేవారని తెలిపారు. శుక్రవారం ముగ్గురూ కలిసి గ్రామశివారులో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రాజు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాగరాజు వద్ద 40 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్, భరత్‌కుమార్ నుంచి మొబైల్ ఫోన్, లింగంపల్లి దుర్గయ్య వద్ద గంజాయి సేవించేందుకు తాటి ఆకులతో తయారు చేసిన చిల్లాను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కేసును పరిశోధించిన ఎస్ఐ రాజు, సిబ్బందిని సీఐ అభినందించడంతో పాటు జిల్లా పోలీస్ కమిషనర్ ద్వారా రివార్డును అందజేస్తామని పేర్కొన్నారు.


పట్టుబడిన గంజాయి, సెల్‌ఫోన్లు, చిల్లా

జంతువులను హింసిస్తే కఠిన చర్యలు

● జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 16: జంతువులను హింసిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమతో ఉండాలన్నారు. మూగ జీవులను హింసించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అక్కడక్కడ కుక్కల బెడద ఉందని, వాటి సంఖ్యను తగ్గించడానికి యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) వంటి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందుకోసం జిల్లాలో కుక్కల సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 43,751, మున్సిపాలిటీల్లో 17,770 కుక్కలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని ఏసీబీ కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఇంట్లో చెత్తను మున్సిపాలిటీ వాహనాల్లోనే వేయాలని, బయట పారేయకూడదని, అలా చేస్తే కుక్కలు చెత్త వేసిన ప్రాంతాల్లో చేరతాయన్నారు. వాటి ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. దాబా, హోటళ్లు, మాంసం దుకాణాల యజమానులు చెత్తను రోడ్ల పక్కన వేయకూడదని సూచించారు. కుక్కలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయవద్దని, చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు తోడు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ జేడీ వసంతకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, డాక్టర్లు రవీందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ భాష మార్చుకోవాలి: ఎమ్మెల్యే చింతా


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 16: అమెరికా వెళ్లి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి చిప్ప దొబ్బిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రాల సీఎంలు కూడా రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష మాట్లాడటం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భాష మార్చుకోవాలని సూచించారు. అలవి కాని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెడతారన్న భయంతోనే తూతూ మంత్రంగా రైతు రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదన్నారు. అసెంబ్లీలో కూడా రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత క్రమశిక్షణ లేకుండాపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు కాక మీదున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గానీ, మంత్రులుగానీ గ్రామాల్లో పర్యటిస్తే అడ్డుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు రైతుబంధు లేదు, కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదని, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలుగా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేసే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, శివకుమార్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి: ఎంపీ రఘునందన్‌రావు


ఎంపీ రఘునందన్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త, మంగువారి ధార్మిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు మంగు రాధాకృష్ణరావు

నంగునూరు, ఆగస్టు 16: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆయన సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సగం మంది రైతులకే మాఫీ చేసిందని, ప్రతీ గ్రామంలో రైతులు తమకు రుణమాఫీ కాలేదని చెప్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వందశాతం రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. షరతులు, నిబంధనలను విధించి 50శాతం మందికే రుణమాఫీ చేశారని విమర్శించారు. రుణమాఫీ విషయంలో క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీలకు వచ్చి రచ్చబండ వద్ద తెలుసుకోవాలన్నారు. గొప్పలు చెప్పుకోవడం కంటే గ్రామస్థాయిలోకి వెళ్లి రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు తుంగ కనకయ్య, వెంకట్రాంరెడ్డి, వెంకటరెడ్డి, తిరుపతిరావు, వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త, మంగు వారి ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు మంగు రాధాకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో ఎంపీ పూజలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 16: సిద్దిపేటలోని శ్రీ వెంకటేశ్వరాలయాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎంపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఎంపీతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్, బీజేపీ నాయకులు ఉన్నారు.

వెండికోలు, కోర్పోలు రైతులతో సమావేశం

పుల్‌కల్, ఆగస్టు 16: చౌటకూర్ మండలంలో ట్రిబుల్ ఆర్ ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులతో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. సమావేశానికి హాజరైన రైతులు పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ ధరలకనుగుణంగా పరిహారం చెల్లించాలంటూ రైతులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సర్వే నంబర్లలోనూ తేడాలు ఉన్నాయని, తప్పుడు సర్వేలు చేపట్టారని అభ్యంతరం వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతులను గుర్తించేందుకు మరోమారు క్షేత్ర స్థాయిలో రీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారి ఏర్పాటులో భూములు కోల్పోకపోయినప్పటికీ, నోటీసులు జారీచేశారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఇప్పటికే హైటెన్షన్ విద్యుత్ టవర్ల ఏర్పాటుతో భూములు కోల్పోయామని తాజాగా ట్రిబుల్ ఆర్ ఏర్పాటుతో మళ్లీ ఉన్న కాస్తా భూములను కోల్పోవాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోయారు.

మున్సిపాలిటీలో విలీనం వద్దు..

● ఎంపీ, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్, మాజీమంత్రులకు గ్రామస్థుల వినతి

జహీరాబాద్, ఆగస్టు 16: జహీరాబాద్ సమీపంలోని హోతి(కే) గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దంటూ గురువారం సాయంత్రం పట్టణంలోని ఎంపీ గెస్ట్‌హౌజ్‌లో ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్‌తో గ్రామస్థులు వేడుకున్నారు. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం మున్సిపల్ అధికారులు మరోమారు వార్డుల విభజన సవరింపుల ప్రక్రియను చేపట్టారు. ఈ విషయమై జహీరాబాద్ ఎంపీ, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ తదితరులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని గెస్ట్‌హౌజ్‌కు పిలిపించి వార్డుల విభజన సవరింపుల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాము వార్డుల విభజన సవరింపుల ప్రక్రియను ఓటర్లకు, ప్రజలకు అనుకూలంగానే చేపడుతున్నామని వివరించారు. ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, గిరిధర్‌రెడ్డి స్పందిస్తూ విలీన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా చూస్తామని గ్రామస్థులకు హామీఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దంటూ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిలకు విన్నవిస్తున్న హోతి(కే)గ్రామస్థులు

పారిశుధ్య పనులపై ఆగ్రహం


మురుగు కాలువను పరిశీలిస్తున్న డీఎల్పీవో

చేర్యాల, ఆగస్టు 16: ఆకునూరులోని పలు వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టక అస్తవ్యస్తంగా ఉండటాన్ని చూసిన సిద్దిపేట డీఎల్పీవో మల్లికార్జున్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆకునూరు గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. వీధుల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు తొలగించాలని, చెత్తచెదారం నిల్వ ఉండకుండా మురుగునీటి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వైద్య సిబ్బందితో కలిసి ఉదయం 7 గంటల నుంచి 11గంటల వరకు ఇంటింటి సర్వేచేపట్టి వివరాలు నమోదు చేయాలన్నారు.

చేర్యాల పట్టణ బంద్ విజయవంతం


చేర్యాలలో బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

చేర్యాల, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హిందూ ఆలయాల విధ్వంసాలను నిరసిస్తూ శుక్రవారం చేర్యాలలో విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చేపట్టిన పట్టణబంద్ విజయవంతమైంది. ఈమేరకు పట్టణంలోని వర్తక, వ్యాపార, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బంద్ సందర్భంగా వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు పట్టణంలో బస్టాండు నుంచి చుంచనకోట క్రాస్‌రోడ్డు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు.

నేడు హుస్నాబాద్ బంద్

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం హిందు సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో హుస్నాబాద్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆ సంఘం కన్వీనర్ ప్రకాశ్ తెలిపారు. బంద్ నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వర్తక, వ్యాపార, కిరణా, హోటళ్ల యజమానులను స్వయంగా కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, చిట్టి గోపాల్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు బత్తుల శంకర్‌బాబు, వీరాచారి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.


చేర్యాల: ఎమ్మెల్యే కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


హుస్నాబాద్: కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


దుబ్బాక: దుబ్బాకలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

● కాంగ్రెస్ నాయకుల డిమాండ్

మహిళలకు ఎమ్మెల్యే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణంపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన చిత్రపటాలను, దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను చూసి ఓర్వలేకనే అలా మాట్లాడుతున్నారని ఆరోపించారు.
- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


గజ్వేల్: కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేయడానికి సిద్ధమవుతున్న కాంగ్రెస్ నాయకులు


దూళిమిట్ట: మండల కేంద్రంలో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, పీసీసీ సభ్యుడు చంద్రం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేట టౌన్, ఆగస్టు16: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి, రైతులకిచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలో శుక్రవారం వేరువేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని అన్న బీఆర్‌ఎస్ నాయకులు మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేయకుంటే ప్రజల్లో మీరు మరింత విశ్వాసం కోల్పోతారన్నారు. ఇప్పటికే ప్రజలు మీరు చేసిన ఘనకార్యాలను చూసి అధికారంలో నుంచి దింపి ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని, ఆ అర్హత కూడా మీరు కోల్పోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, రాశద్, సందీప్‌యాదవ్, నజ్జూ, అజయ్, అనిల్, ఉమేశ్ యాదవ్, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

● **మద్దూరు:** సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని నర్సాయపల్లిలో గురువారం రాత్రి ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.


మద్దూరు: నర్సాయపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

● **సిద్దిపేట రూరల్:** ఎన్నికల ముందు రైతులకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమ్మరి రాములు పేర్కొన్నారు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ చేయడంతో రైతులు గ్రామగ్రామాన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐరేని ఆంజిరెడ్డి, గరిపల్లి వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లూరి కనకయ్య, దేవిరెడ్డి, రవి, యాదగిరి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలు అటకెక్కాయి

● బీఆర్‌ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచితంగా పేదలకు అందుతున్న వైద్య సదుపాయాలు అటకెక్కాయని బీఆర్‌ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి ఆరోపించారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ప్రతినెల ఉచితంగా అందించే మందులలో కాంబినేషన్ మెడిసిన్ లేకపోవడంతో ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనుకుంటున్నారన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రుణమాఫీ, ప్రభుత్వ పథకాలు రాని వారికి సమాధానం చెప్పే కాంగ్రెస్ నాయకులే సిద్దిపేటకు రావాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ సతీష్, సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ మెంబర్ శ్రీనివాస్, నరసింహులు, రాజు పలువురు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో నాయకులు

దుబ్బాక, ఆగస్టు 16: దుబ్బాకలోని బాలాజీ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. మూడో వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి వివిధ రకాల స్వీట్లతో స్వామివారికి ప్రసాదంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ తదితరులున్నారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మర్కుక్, ఆగస్టు 16: మర్కుక్ మండలం గణేష్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మతల్లి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మర్కుక్ మండల తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, తాజా మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్‌లు హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీకి రూ.46000 నగదును స్థానిక తాజా మాజీ సర్పంచ్ వెతుకు మంజుల శ్రీరాములు, తాజా మాజీ ఉపసర్పంచ్ పుట్ట మహేష్‌లు అందజేశారు. కేసీఎం ఆసుపత్రి అధినేత కొత్త శ్యామ్‌సుందర్, గణేష్‌పల్లి రైస్‌మిల్ యాజమాన్యం కొల్గూరి అంజిరెడ్డి, సూర విష్ణు సౌజన్యంతో రెండు రోజులు అన్నదానం నిర్వహించారు.

'సీఎంను విమర్శించే స్థాయి హరీశ్‌రావుకు లేదు'

ములుగు, ఆగస్టు 16: రైతులకు మూడు దఫాల్లో రుణమాఫీ విడుదల చేస్తామని చెప్పి, మూడో విడత రుణమాఫీని విడుదల చేసి కాంగ్రెస్ ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అన్నసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వంటిమామిడిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి జీర్ణించుకోలేక సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్థాయి మరిచి మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా జ్ఞానోదయం చేసుకుని పని చేసే ప్రభుత్వాన్ని సహకరించాలన్నారు.

చేర్యాలలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

చేర్యాల, ఆగస్టు 16: ఉపాధిహామీ పథకం ద్వారా చేర్యాల మండలంలో జరిగిన పనులను ఇటీవల సోషల్ ఆడిట్ బృందం తనిఖీ చేసి నివేదిక రూపొందించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీఆర్డీవో బాలకృష్ణ, ఏపీడీ శివాజీ, అంబుడ్స్‌మెన్ ఆరీఫ్, సోషల్ ఆడిట్ రీసోర్స్ పర్సన్ గంగ రాజు, ఎస్టీఎం దత్తు తదితరుల సమక్షంలో ప్రజావేదిక కొనసాగింది. హాజరు, మస్టర్ రోల్, ఆన్‌లైన్ తప్పుడు ఎంట్రీ ఇతరత్రా అంశాలకు సంబంధించి రూ.22వేలు రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

'అవగాహనతోనే క్షయ వ్యాధి నివారణ'


పాలమాకుల సబ్ సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్

నంగునూరు, ఆగస్టు 16: అవగాహనతోనే క్షయ వ్యాధిని నివారించవచ్చని టీబీ అలర్ట్ ఇండియా ఇంపాక్ట్ ప్రోగ్రాం సిద్దిపేట జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పాలమాకుల సబ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించి క్షయ నివారణపై స్థానిక సిబ్బందితో మాట్లాడారు. వ్యాధిగ్రస్థులకు మందులు ఇస్తున్న విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీబీ వ్యాధిగ్రస్థులను చులకన చేయకుండా మానవత్వంతో చూస్తూ వ్యాధి తగ్గేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ శివకిషోర్‌రెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది ఆయా సబ్ సెంటర్ ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల ఎన్నిక

సిద్దిపేట రూరల్/చేర్యాల/హుస్నాబాద్,ఆగస్టు 16: సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లికి చెందిన మిట్టపల్లి సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. తనపై నమ్మకంతో సీపీఐ జిల్లా కౌన్సిల్ ఎంపికకు సహకరించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కలవేణి శంకర్, జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, సిద్దిపేట రూరల్ మండలం నిర్మాణ బాధ్యులు కనుకుంట్ల శంకర్, పార్టీ జిల్లా కార్యవర్గానికి కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా చేర్యాల పట్టణానికి చెందిన రామగల్ల నరేశ్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్ వెల్లడించారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌కు చెందిన పిట్టల బాలయ్యను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ తెలిపారు.

ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలు

కొండపాక, ఆగస్టు 16: ప్రత్యేక రాష్ట్రంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు కస్తూరి సతీష్ తెలిపారు. దుద్దెడ మార్కండేయ పద్మశాలి సమాజంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బొజ్జ మహదేవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి బూర మల్లేశం, ఉపాధ్యక్షుడు జోగు బిక్షపతి, ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్తూరి సతీష్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో పద్మశాలిలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మార్కండేయ ఆలయంలో వేర్వేరుగా రెండు ఎలక్షన్ బూత్‌లలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనునట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ వడ్లకొండ మల్లేశం, సంఘం ప్రధాన కార్యదర్శి చిలగాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీహరి, సలహాదారు వడ్లకొండ శ్రీనివాస్, బింగి వేణు, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

శిశు మందిర్ విద్యార్థినుల రక్షాబంధన్

హుస్నాబాద్, ఆగస్టు 16: హుస్నాబాద్ పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ విద్యార్థినులు శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బస్ డిపోలోని అధికారులు, ప్రజలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ప్రధానాచార్యులు గట్టు రమ, అచార్యులు తదితరులున్నారు.


దుబ్బాకలోని శ్రీబాలాజీ వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు దంపతులకు స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు
-దుబ్బాక

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

మద్దూరు, ఆగస్టు 16: మద్దూరు మండలంలో మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మద్దూరులోని రామాలయంలో అర్చకులు పానుగంటి తిరుపతయ్య వరలక్ష్మి వ్రతాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకున్నారు. ఇంటికి వచ్చిన ముత్తైదువులకు వాయినాలు, తాంబులాలు ఇచ్చారు.

● **కొండపాక:** శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు తమ తమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతం చేసుకున్నారు.


హుస్నాబాద్: కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

● **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో వరలక్ష్మి వ్రతాలను మహిళలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని శిశుమందిర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కుటుంబసభ్యులతో కలిసి వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

● సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ

సిద్దిపేట టౌన్, ఆగస్టు16: వర్షా కాలం దృష్ట్యా అధికారులు, పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ టెలి కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, తప్పనిసరిగా తమ తమ పరిధిలోని వార్డులలో పర్యటిస్తూ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని, ఎక్కడైనా నీరు నిలిచినట్లైతే వెంటనే తొలగించాలని ఆదేశించారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన గృహాల్లో ఉండకూడదన్నారు.

మహిళ సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలలోని అర్హులైన మహిళలకు వివిధ వ్యాపారాల నిమిత్తం బ్యాంకులో రుణ సౌకర్యం కల్పించనున్నట్లు సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 128 మంది మహిళలకు 12 రకాల వ్యాపారాలపై పలు బ్యాంకు అధికారులతో కలిసి శుక్రవారం


సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు, మున్సిపల్ కమిషనర్ ప్రేరణ

ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, కమిషనర్ ప్రేరణ మాట్లాడుతూ.. కూరగాయలు, పండ్లు, బేకరీ, పాల ఉత్పత్తి, మైక్ సెట్, సౌండ్ సెట్, బ్యూటీ, వెల్‌నెస్ సెంటర్, టెంట్‌హౌస్, ఫ్యాన్సీ స్టోర్, కిరాణం, జనరల్ స్టోర్, తదితర వ్యాపారాలు నిర్వహించుకోవడానికి దరఖాస్తులను సిద్దిపేట మెప్మా విభాగంలో స్వీకరిస్తామని తెలిపారు. ఇట్టి దరఖాస్తులను బ్యాంకు అధికారులు పరిశీలించి అర్హత ఉన్న మహిళలకు రుణాలు అందజేస్తారన్నారు.

భూ తగదాలో నలుగురిపై కేసు

కొండపాక, ఆగస్టు 16: మండలంలోని మర్పడగలో భూ తగాదా నేపథ్యంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దెబ్బట యాదగిరి 30 సంవత్సరాల నుంచి భూమి సాగు చేసుకుంటున్నాడు. ఆ భూమి తమదే నంటూ గ్రామానికి చెందిన బద్ది రాజు, ఆయన భార్య సుందరవ్వ, తల్లి పోశవ్వ, స్నేహితుడు బాపిరెడ్డి కలిసి ట్రాక్టర్ తీసుకువెళ్లి పంటను నష్ట పరుస్తుండగా యాదగిరి అడ్డుకున్నాడు. దీంతో వారు యాదగిరి, ఆయన తండ్రి భూమయ్యపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఊర్లకు వెళ్లేవారు అప్రమత్తంగా..

దౌల్తాబాద్, అగస్టు 16: ఊర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముదస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ సూచించారు. దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో వారంరోజులుగా గ్రామ శివారులల్లో తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. కావును ఊర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

● యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి

గజ్వేల్, ఆగస్టు 16: బాయ్స్ ఎడ్యుకేషన్ హబ్‌లో ఉన్న నీటి సమస్యను పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని బాయ్స్ ఎడ్యుకేషన్ హబ్‌లో పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ హాస్టల్స్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్స్‌కు ప్రధానంగా నీటి సమస్య ఉందని, ఈ హబ్‌లో నీరు లేకపోవడంతో పాఠశాలలోని మూత్రశాలలు మూసివేశారని, పిల్లలు భోజన సమయంలో తమ ప్లేట్లు కడుక్కోవడానికి కూడా నీళ్లు లేవన్నారు. నీటి సమస్యను పరిష్కరించని పక్షంలో విద్యార్థులతో కలసి రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఆయనవెంట యూఎస్ఎఫ్ఐ నాయకుడు నాచారం శేఖర్, నరేశ్, స్వామి తదితరులున్నారు.

ఎల్లమ్మ తల్లికి ఇత్తడి మకర తోరణం



చేర్యాల, ఆగస్టు 16: కొమురవెల్లి మండలం రాంసాగర్‌కు చెందిన భక్తుడు అక్కనపల్లి సుధీర్‌రెడ్డి కొమురవెల్లి మల్లికార్జున స్వామి సహోదరి అయిన ఎల్లమ్మ తల్లి మూలవిరాట్టుకు ఇత్తడి మకర తోరణాన్ని మొక్కుబడి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి మూలవిరాట్టుకు అలంకరించారు.

'విగ్రహావిష్కరణకు తరలిరావాలి'

కోహెడ, ఆగస్టు 16: హైదరాబాద్ నగర తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహ ఆవిష్కరణకు జిల్లా నలుమూలల ముదిరాజ్‌లు తరలిరావాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కొరివి కృష్ణ ముదిరాజ్ విగ్రహ ఆవిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈనెల 25న సిద్దిపేట జిల్లా కేంద్రంలో విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

● బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య


సీఎం ఫ్లెక్సీకి ఫినాయిల్ పూస్తున్న నాయకులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 16: సీఎం రేవంత్‌రెడ్డి నిన్న నిర్వహించిన సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా హరీశ్‌రావుకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొంగరి దేవరాజు, బుగ్గ దేవస్థానం మాజీ చైర్మన్ కిషన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అక్బర్, బీఆర్‌ఎస్ నాయకులు పుర్ర రాజయ్య, బాలయ్య, రాజయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి ఫినాయిల్ పూసిన నాయకులు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి బ్రష్‌తో ఫినాయిల్ పూసి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, పట్టణ అధ్యక్షుడు గరిపల్లి మహిపాల్‌గౌడ్, నిమ్మ రజనీకాంత్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ.. ఖమ్మం సభలో తెలంగాణ ఉద్యమ నాయకుడు, ప్రజల గొంతుక అయినటువంటి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై వ్యక్తిగత దూషణకు పాల్పడడం సభ్య సమాజం సిగ్గుపడుతుందన్నారు. కార్యక్రమంలో నారాయణరావుపేట మండల అధ్యక్షుడు ఆకుల సతీష్, పట్టణ సమన్వయ కర్త ఇరుగంటి రమేష్, దొడ్ల అరవింద్‌రెడ్డి, పెర్క మధు, గొల్లపల్లి రాజశేఖర్‌రెడ్డి, పెర్క నాగరాజు, కొట్టె ఎల్లేష్, అప్పల శేఖర్, కమల్ యాదవ్, అనిల్‌యాదవ్, నాగరాజుయాదవ్, బాసంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16: అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్లో శుక్రవారం నిర్వహించిన టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలన్నారు. ఉపాధ్యాయ ,ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏ లను వెంటనే మంజూరు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను వెంటనే సర్దుబాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర కౌన్సిలర్లు కేశవరెడ్డి, జానకిరాములు, జిల్లా నాయకులు శివాజీ, నర్సింహారెడ్డి, రామ్‌రెడ్డి, మల్లేశం ,సత్య కృష్ణ, నరేందర్, బాబురెడ్డి బాల్రెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతాంగం పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 16: రుణమాఫీ పొందని రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడుతుందని ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 47లక్షల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, కేవలం 25లక్షల మంది రైతులకు రూ.17వేల 900కోట్ల రుణమాఫీ మాత్రమే చేసి రుణమాఫీ చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో 46శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని, 54శాతం మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. తమ రుణాలు మాఫీ కాలేదని రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ, బ్యాంకులు, రైతువేదికల చుట్టూ తిరుగుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ రైతుల పక్షాన నిలబడుతుందని, త్వరలో గజ్వేల్ పట్టణంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌తో బహిరంగసభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పైరవీలు, సెటిల్మెంట్‌లు వదిలేసి ప్రజలకు నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, గజ్వేల్ పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మండలాధ్యక్షుడు బెండే మధు, కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, నాయకులు నర్సింగరావు, గంగిశెట్టి రవిందర్, శీర్ల మల్లేశం, తలకొక్కుల దుర్గాప్రసాద్, కళ్యాణ్‌కర్ నర్సింగరావు, వంటేరు దయానందరెడ్డి, ఉమర్, రాజు, బాలేష్ ఉన్నారు.

రుణమాఫీ సంపూర్ణంగా జరగలేదు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 16: హామీ ఇచ్చిన మేరకు రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా రాజీనామాల గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రంగదాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లి రుణమాఫీ గురించి తెలుసుకుందామని, అప్పుడు రాజీనామాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. సమావేశంలో వెంకట్, సాయిప్రేమ్ పాల్గొన్నారు.

● **మర్కుక్:** ఏకకాలంలో రూ. 40వేల కోట్ల రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ప్రమాణం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మూడు విడతలుగా రుణమాఫీ చేసి, తీరా సగానికి సగం మంది రైతులకు కోత పెట్టడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ కింద రూ. 31వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి మిగతా డబ్బులకు కోత పెట్టారన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. సమావేశంలో ఆత్మ కమిటీ మాజీ సభ్యుడు సంతోష్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, మహేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్: విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి